

రంజాన్ వేళలు

ఇఫ్తార్ సాయంత్రం గంటల 6.23(మంగళవారం)
సహేరీ ఉదయం గంటల5.02 (బుధవారం)



మొదటి రోజు ప్రశాంతం

- పది పరీక్షల్లో 93 శాతం హాజరు
- 1595 మంది విద్యార్థులు గైర్హాజరు
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

నంద్యాల (నూనెపల్లె), మార్చి 18 : పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు జిల్లా వ్యాప్తంగా 134 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొదటి రోజు పరీక్ష కావడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పరీక్షా కేంద్రాలకు గంట ముందే చేరుకున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష జరిగింది. ఉదయం 8.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 25,945 మంది విద్యార్థులకుగాను 24,350 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 1595 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. మొదటి రోజు పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 93.85 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు 28 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయి. పరీక్షల పర్యవేక్షకులుగా రాష్ట్ర పరిశీలకులు ఆర్‌ఎస్ గంగాభవాని ఆరు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. సమస్యాత్మక కేంద్రాలలో సజావుగా పరీక్షలు జరిగేందుకు సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. పదో తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి డీఈవో సుధాకర్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు.



డీఈవోపై కలెక్టర్ సీరియస్

పదవ తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్ శ్రీనివాసులు డీఈవో సుధాకర్‌రెడ్డిపై సీరియస్ అయ్యారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీజీ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్ సెల్‌ఫోన్ వెంట తెచ్చుకోవడంపై కలెక్టర్ మండిపడ్డారు. పక్కనే ఉన్న డీఈవోను వివరణ కోరారు.

సౌకర్యాల కల్పనలో డొల్లతనం

పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించడంలో అధికారుల డొల్లతనం బయటపడింది. ఎస్పీజీ ఉన్నత పాఠశాల కేంద్రంలో కొన్ని గదులలో లైట్లు, ఫ్యాన్లు లేవు. అదేవిధంగా కేఎస్‌ఎం మున్సిపల్ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పాఠశాల మొదటి అంతస్థు భవనాన్ని నాడు - నేడు పనులలో భాగంగా ఆధునికీకరించారు. పూర్తి స్థాయిలో పనులు పూర్తి కాకపోవడంతో ఫ్యాన్లు, లైట్లు లేని హాలులోనే విద్యార్థులు పరీక్ష రాయాల్సిన దుస్థితి ఏర్పడింది. టెక్కెలోని మున్సిపల్ హైస్కూల్, నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్ కేంద్రాల్లో కూడా అదే పరిస్థితి. కొన్ని కేంద్రాల్లో ఫస్ట్ ఎయిడ్ చేసే మెడికల్ సిబ్బంది కనపడలేదు.

ఆర్టీసీ బస్సులేవి..?

పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు అధికారులు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కావడంతో ఆ సమయంలో బస్సు సర్వీసులు లేక ఆటోల్లోనే కేంద్రాలకు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆటోలు, ద్విచక్ర వాహనాల ద్వారా పరీక్షలకు వెళ్లాల్సి వచ్చింది.



తండ్రి సహాయంతో పరీక్షకు హాజరైన ఇంతియాజ్‌బాషా



విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు



నంద్యాలలో ఫ్యాన్లు, లైట్లు లేని పరీక్షా కేంద్రం గది

అప్రమత్తంగా విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

నంద్యాల (నూనెపల్లె), మార్చి 18 : ఎన్నికల నిర్వహణ విధులను అప్రమత్తంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల నిర్వహణపై 16 కమిటీల నోడల్ అధికారులతో జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోడల్ అధికారులకు అప్పగించిన విధులను బాధ్యతగా చేపట్టాలని సూచించారు. 16 కమిటీల నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. పోలింగ్ విధుల నిర్వహణకు కాంట్రాక్టు సిబ్బంది మినహా ఇంకా ఏదైనా శాఖల సిబ్బందిని గుర్తించి మంగళవారం సాయంత్రంలోగా అందజేయాలని జిల్లా ట్రెజరీ అధికారులను ఆదేశించారు. ఎస్‌సీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు కేటాయించే వీడియో గ్రాఫర్లకు మంగళవారం శిక్షణ ఇవ్వాలని అన్నారు. పోలింగ్ శాతం తక్కువగా ఉండే పోలింగ్ స్టేషన్ల పరిధిలో కారణాలను విశ్లేషించాలని, పోలింగ్ శాతాన్ని పెంచాలని, ఓటర్లకు అవగాహన కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. వృద్ధులు, వికలాంగ ఓటర్లు, సర్వీస్ ఓటర్ల వర్తించే పోస్టల్ బ్యాలెట్ పత్రాలపై శిక్షణ ఇవ్వాలని అన్నారు. ఎన్నికల పరిశీలనకు వచ్చే పరిశీలకులకు వసతి, లైజన్ ఆఫీసర్ల కేటాయింపుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సివిల్ సప్లయ్ డీఎంను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌వో పద్మజ, కమిటీల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై జ్వాలా నృసింహుడు



దిగువ అహోబిలంలో హంసవాహనంపై విహరిస్తున్న శ్రీవారు

నంద్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో నాలుగో రోజు సోమవారం శ్రీవారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారు సోమవారం రాత్రి హనుమంత వాహనంపై విహరించారు. అదేవిధంగా దిగువ అహోబిలంలో ప్రహ్లాద వరదస్వామి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

మూల్యాంకనంలో కచ్చితత్వం ఉండాలి

- ఇంటర్ స్పాట్ విధులకు గైర్హాజరైతే జరిమానా
- ఆర్‌ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి



మాట్లాడుతున్న ఆర్‌ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 18: ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనంలో ఎలాంటి పొరపాట్లు జరగరాదని, కచ్చితత్వం ఉండాలని ఆర్‌ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి ఎగ్జామినర్లకు సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో ఎగ్జామినర్లకు ఇంటర్ పరీక్ష జవాబుపత్రాల మూల్యాంకనంపై వర్క్‌షాపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్యూటీ ఆర్డర్స్ వచ్చిన వారందరూ విధులకు తప్పక హాజరు కావాలని తెలిపారు. విధులకు గైర్హాజరైతే క్షమించే ప్రసక్తే లేదని, రోజుకు రూ.1000 జరిమానా విధిస్తామన్నారు. అంతేగాకుండా ప్రభుత్వ అధ్యాపకులైతే జరిమానాతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు శాఖపరమైన చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రైవేటు కళాశాలలో పని చేసే అధ్యాపకులైతే.. ఆ కళాశాలల యజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జవాబు పత్రాల మూల్యాంకనంలో ఎగ్జామినర్లు ఎక్కువ, తక్కువ మార్కులు వేయడానికి వీల్లేదని, కచ్చితత్వం పాటించాలని అన్నారు. సోమవారం నుంచి ప్రారంభమైన జవాబుపత్రాల మూల్యాంకన శిబిరానికి మొత్తం 420 మంది ఎగ్జామినర్లు హాజరు కావాల్సి ఉండగా.. అందులో 294 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. ఈ నెల 18 నుంచి ఇంగ్లీషు, గణితం, సివిక్స్, తెలుగు, హిందీ, ఉర్దూ, అరబిక్, పర్షియన్, కన్నడ సబ్జెక్టుల జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. విధులకు ఆలస్యంగా రావడం కానీ, ముందుగా వెళ్లడం కానీ జరగరాదన్నారు. ఈ సమావేశంలో డీవీఈవో జమీర్‌పాషా, ప్రిన్సిపాల్స్ పరమేశ్వరరెడ్డి, సుంకన్న, ఎగ్జామినర్లు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాల తనిఖీ



నంద్యాల క్రైం, మార్చి 18 : పదో తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ కె.శ్రీనివాస్, ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిలు సోమవారం తనిఖీ చేశారు. ఈ మేరకు వారు నంద్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ బాలికల హైస్కూల్, ఎస్పీజీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయన్నారు. ఎలాంటి మాస్కాపీయింగ్ జరగకుండా ఉండేందుకు విద్యార్థులను తనిఖీ చేసిన తర్వాతనే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తున్నామని తెలిపారు. సిబ్బంది, ఉపాధ్యాయులు మొదలుకొని చీఫ్ సూపరింటెండెంట్ వరకు ఎవరూ పరీక్షా కేంద్రాలకు సెల్‌ఫోన్ తీసుకెళ్లకూడదని అన్నారు. ఎస్పీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రతి పరీక్షా కేంద్రం వద్ద కట్టుదిట్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద స్థానిక పోలీసులతోపాటు మహిళా పోలీసులు, ఎస్సై, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలులో ఉందని పేర్కొన్నారు. ప్రజలెవరూ పరీక్షా కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో గుమికూడి ఉండకూడదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో ఎటువంటి జిరాక్స్ సెంటర్లు తెరవడానికి అనుమతి లేదన్నారు. పై నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

ప్రజాగళం ఘన విజయం

- నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, మార్చి 18: ప్రజాగళం సభ విజయవంతమైందని, కూటమిదే అధికారమని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో విలేకరుల సమావేశంలో రాజశేఖర్ మాట్లాడుతూ సీఎం జగన్ రెడ్డి అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజలు నిర్ణయించుకున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ప్రజాగళం సభకు లక్షల్లో జనం వచ్చి తమ మద్దతు తెలిపారన్నారు. జగన్ హయాంలో రాష్ట్రం సర్వనాశనమైందని, వైసీపీ భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలు వేరు కాదని, ఈ రెండు పార్టీలు ఒకే కుటుంబానికి చెందినవేనన్నారు. ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, జగన్ ప్రభుత్వాన్ని అధికారం లో నుంచి దింపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో టీడీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు 75 శాతం పూర్తి చేసిందన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును అడ్డుకుందన్నారు. వైసీపీ హయాంలో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులన్నీ అధ్వానంగా మారాయన్నారు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాబోతుందన్నారు. పోలవరాన్ని అమరావతి రాజధానిని, ప్రాజెక్టులను అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్‌మహబూబ్‌బాషా, లాయర్ చక్రపాణి, కాపు సంఘం యువ నాయకుడు కేవీ మధు పాల్గొన్నారు.

టీడీపీ సానుభూతిపరుడి హత్య

- కత్తితో దాడికి పాల్పడిన వైసీపీ వర్గీయుడు
- చాగలమర్రిలో ఘటన



ఇమాంహుస్సేన్ మృతదేహం



ఇమాంహుస్సేన్ (ఫైల్)

చాగలమర్రి, మార్చి 18: వేలం పాటలో జరిగిన తగాదా ఒకరి ప్రాణాన్ని బలిగొంది. టీడీపీ సానుభూతిపరుడిపై వైసీపీ నాయకుడు కత్తితో పొడిచి దారుణ హత్యకు పాల్పడిన సంఘటన చాగలమర్రి మండల ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చాగలమర్రి పంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఈఓ నాగమణి ఆధ్వర్యంలో సోమవారం బస్టాండు, సంత మార్కెట్, కబేళా, దినమార్కెట్ నిర్వహణకు వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో పాల్గొనేందుకు రసూల్, అతడి కుమారుడు ఇమాంహుస్సేన్ (21) రూ.80 వేలు డిపాజిట్ చేశాడు. అదే వేలం పాటలో వైసీపీ నాయకుడిగా చెలామణి అవుతున్న అబ్దుల్‌ఖాదర్ కుమారుడు దస్తగిరి వేలం పాటలో పాల్గొనేందుకు వచ్చాడు. వేలం పాటలు నిర్వహిస్తుండగా అబ్దుల్‌ఖాదర్ మధ్యలో కలగజేసుకుని డిపాజిట్ చేసిన వారు మాత్రమే ఇక్కడ ఉండాలని వాదనకు దిగాడు. ఈ క్రమంలో అబ్దుల్‌ఖాదర్, రసూల్ మధ్య వాగ్వివాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో ఈఓ నాగమణి వేలం పాటను వాయిదా వేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద అబ్దుల్‌ఖాదర్ కుమారుడు దస్తగిరి, రసూల్ కుమారుడు ఇమాంహుస్సేన్‌లు ఘర్షణ పడ్డారు. దస్తగిరి తన దగ్గర ఉంచుకున్న కత్తితో ఇమాంహుస్సేన్‌పై దాడి చేయడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానిక కేరళ వైద్యశాలకు తరలించగా అప్పటికే యువకుడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్, సీఐ హనుమంతనాయక్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అబ్దుల్‌ఖాదర్, దస్తగిరిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమణయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించారు. యువకుడి దారుణ హత్య సంఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది. రసూల్ రెండో కుమారుడు మహబూబ్‌బాషా తొమ్మిదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, డిగ్రీ పూర్తి చేసి తనకు ఆసరాగా ఉన్న ఇమాంహుస్సేన్ హత్యకు గురి కావడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

హత్యపై డీఎస్పీ విచారణ

చాగలమర్రిలోని మూడవ సచివాలయం సమీపంలో సోమవారం జరిగిన యువకుడి దారుణ హత్యపై ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ విచారణ చేశారు. హత్య జరిగిన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మూడో సచివాలయం పరిధిలో ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈఓ నాగమణితో వివరాలు సేకరించారు. డీఎస్పీ వెంట ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతనాయక్, ఏఎస్ఐ అబ్దుల్‌నబీ ఉన్నారు.



చాగలమర్రిలో ఈవోతో విచారణ చేస్తున్న డీఎస్పీ, సీఐ



మంత్రాలయం మండలంలోని మాధవరం చెక్ పోస్టు

కోడ్‌తో కాస్త జాగ్రత్త

- నగదు, బంగారం తరలింపుపై ఆంక్షలు
- రూ.50 వేలకు మించితే ఆధారాలు చూపాల్సిందే
- రూ.10 లక్షలపైన ఉంటే ఆదాయ పన్ను శాఖకు అప్పగింత
- జిల్లాలో అంతర్ రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు

కర్నూలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. నగదు, మద్యం అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు చేపట్టారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి జిల్లాలోకి వచ్చే ప్రధాన రహదారుల సరిహద్దుల్లో అంతర్ రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వాహనాల తనిఖీలు ప్రారంభించారు. నగదు, బంగారం తరలింపుపై ఆంక్షలు విధించారు. రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే సంబంధించిన ఆధారాలు చూపించాలి. సరైన పత్రాలు చూపించకపోతే సీజ్ చేస్తారు. కలెక్టర్ అధ్యక్షతన ముగ్గురు అధికారులతో స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. పట్టుకున్న డబ్బు, ఇతర వస్తువులను ఈ కమిటీ పరిశీలించి చర్యలు తీసుకుంటుంది. ఎన్నికలు ముగిసే వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని అధికారులు తెలిపారు.


పంచలింగాల చెక్ పోస్టు వద్ద కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

పార్లమెంటు సహా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. శనివారం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో ఆ క్షణం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. సరిహద్దులో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి జిల్లాలో నగదు, మద్యం సహా ఇతర ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే ఎలాంటి వస్తువులను అక్రమంగా రవాణా చేయకుండా అంతర్ జిల్లా, అంతర్‌రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం తనిఖీల సమయంలో ఒక వ్యక్తి వద్ద రూ.50 వేలకు మించి నగదు లభిస్తే ఆ డబ్బులకు తగిన ఆధారాలు చూపాల్సి ఉంటుంది. లేదంటే డబ్బును సీజ్ చేస్తారు. ముఖ్యంగా నగదు, బంగారం ఇతర వస్తువులు తరలింపుపైనా ఆంక్షలు పక్కాగా అమలు చేస్తారు. సామాన్య ప్రజలు నగదు, బంగారం, వెండి వంటిని తీసుకెళ్తూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడితే సరైన పత్రాలు చూపించాలి. లేదంటే వాటిని సీజ్ చేస్తారు. పోలీసులు పట్టుకున్న డబ్బులపై ఎలాంటి ఆక్షేపణలు లేకపోతే వారం రోజుల్లోగా ఆధారాలు చూపిస్తే వాటిని తిరిగి ఇస్తారు. సాధారణ ప్రజలు ఇబ్బందులకు గురికాకుండాకలెక్టర్ అధ్యక్షతన ముగ్గురు అధికారులతో స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. పట్టుకున్న డబ్బులు, ఇతర వస్తువులను ఈ కమిటీ పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటుంది. రాజకీయ నాయకుల వద్ద నగదు, ఇతర వస్తువులు పట్టుకున్నా వెంటనే సీజ్ చేసి కేసులు నమోదు చేస్తారు.

నగదుతో ప్రయాణం.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కోడ్ అమలులో ఉన్న ఈ సమయంలో సామాన్య ప్రజలు నగదుతో ప్రయాణించే సమయంలో ఎన్నికల నిబంధనలను పాటిస్తూ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి సమస్య ఉండదు. విద్యా సంస్థల్లో ఫీజు, ఆసుపత్రుల్లో బిల్లులు చెల్లించడం, శుభకార్యాలు, వ్యాపారులు, ఇతరత్రా అవసరాలకు అధిక మొత్తంగా నగదు తీసుకువెళ్తున్నట్లైతే తగిన ఆధారాలు వెంట తీసుకెళ్లాలి. బ్యాంకు ఖాతా నుంచి నగదు విత్‌డ్రా చేస్తే.. సంబంధిత బ్యాంక్ అకౌంట్ బుక్, ఏటీఎం రశీదులు వెంట తీసుకువెళ్లడం ఉత్తమం.
- ఆసుపత్రులకు డబ్బులతో వెళ్తున్న వారు పేషెంట్ రిపోర్టులు, ఇతర డాక్యుమెంట్లు తమ వెంట ఉంచుకోవాలి.
- వ్యాపారులు, రైతులు వస్తువులు, ధాన్యం, భూముల విక్రయానికి సంబంధించిన డబ్బు అయితే వాటికి సంబంధించిన బిల్లులు, ల్యాండ్ డాక్యుమెంట్లు వెంట ఉంచుకోవాలి. బంగారం, ఆభరణాలు కొనుగోలు సమయంలో తీసుకున్న రశీదులు వెంట ఉంచుకోవాలి.
- వ్యాపారం, ఇతర సేవల కోసం డబ్బు వినియోగిస్తే తనిఖీల సమయంలో లావాదేవీల వివరాలను ఆధారాలతో అధికారులకు చూపించాలి. వ్యక్తుల శరీరంపై ధరించిన ఆభరణాలకు ఎలాంటి ఆంక్షలు ఉండవు.
- రూ.10 లక్షలకుపైగా నగదు లభ్యమైతే ఐటీ, జీఎస్టీ అధికారులు రంగంలోకి దిగుతారు. వాటికి సంబందించిన కచ్చితమైన ఆధారాలు చూపిస్తేనే తిరిగి ఆ డబ్బులు ఇస్తారు. తనిఖీల్లోల పట్టుబడిన నగదు, బంగారం, వెండి ఇతర వస్తువులన్నింటినీ జిల్లా ట్రెజరీలో భద్రపరుస్తారు. స్క్రీమింగ్ కమిటీ, ఆదాయ పన్ను శాఖ అధికారులు రిలీజింగ్ ఆర్డర్ ఇస్తేనే తిరిగి అప్పగిస్తారు.





ఆదోని మండలం పెద్దహరివాణం చెక్ పోస్టు వద్ద తనిఖీలు

ఎన్నికల వేళ అభ్యర్థులు, ఓటర్లకు కీలక సూచనలు

- రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అధిక మొత్తంలో నగదు చెలామణి విషయంలో ఎన్నికల అధికారులు, పోలీసులు, టాస్క్‌ఫోర్స్, సర్వైలెన్ టీం సిబ్బంది అనుక్షణం తనిఖీలు చేస్తుంటారు. స్థానికులు, ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చేవారు ఇబ్బందులు పడకుండా ఉండాలంటే తమతో తీసుకు వెళ్తున్న నగదు, బంగారం, వెండి.. వంటి విలువైన వస్తువులకు సంబంధించి తగిన ఆధారాలు, ధృవపత్రాలను వెంట ఉంచుకోవడం మంచిది. నగదు, బంగారం, వెండి భారీ స్థాయిలో తీసుకెళ్లినా ఇబ్బందికరమని అధికారులు చెబుతున్నారు.
- రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సమావేశాలు నిర్వహించాలంటే ముందుగానే స్థానిక పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. సమావేశం ఎప్పుడు ఎక్కడ నిర్వహిస్తున్నారో ఆ వివరాలు ముందుగా తెలియజేస్తే పోలీసులు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తారు. సమావేశంలో లౌడ్ స్పీకర్లు వినియోగించాలనుకుంటే ముందస్తు అనుమతి తీసుకోవాలి.
- ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించాలనుకుంటే ముందుగానే పోలీసులకు చెప్పాలి. ర్యాలీ ఎక్కడ మొదలవుతుంది.. ఏ మార్గంలో వెళ్తుంది.. ఎన్నింటికి మొదలవుతుంది. ఎన్ని గంటలకు ఎక్కడ ముగుస్తుంది వంటి వివరాలు స్పష్టంగా తెలియజేయాలి. ర్యాలీ నిర్వహించే సమయంలో మార్గం మార్చడం వంటివి చేయరాదు. ర్యాలీ సాగే మార్గంలో అప్పటికీ ఏవైనా నిషేధాజ్ఞలు ఉంటే నిర్వాహకులు పాటించాల్సి ఉంటుంది.
- ఒకే ప్రాంతంలో, ఒకే సమయంలో వేర్వేరు పార్టీలు లేదా వేర్వేరు అభ్యర్థులు ర్యాలీలు నిర్వహించాలనుకుంటే రెండు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇందుకు తగిన సర్దుబాటు కోసం అవసరమైతే స్థానిక పోలీసుల సహకారం తీసుకోవాలి. ర్యాలీలు, సభలు, సమావేశాలు వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి. ఇతర పార్టీల నాయకులు, అభ్యర్థులను పోలిన దిష్టి బొమ్మలను తీసుకెళ్లడం, తగలబెట్టడం నిషేధం.

ఎనిమిది అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు


హొళగుంద మండలం మార్లమడికి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

జిల్లాను ఆనుకుని తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు ఉన్నాయి. నగదు, మద్యం, బంగారం అక్రమ రవాణాను అరికట్టేందుకు 8 చోట్ల అంతర్ రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. హైదరాబాదు-బెంగళూరు జాతీయ రహదారిపై కర్నూలు రూరల్ మండలం పంచలింగాల వద్ద, సుంకేసుల బ్యారేజీ దగ్గర, నందవరం మండలం నాగులదిన్నె బ్రిడ్జి వద్ద, ఆంధ్ర-కర్ణాటక కలిపే మంత్రాలయం మాధవరం బ్రిడ్జి వద్ద, కౌతాళం మండలం బాపురం, ఆదోని మండలం పెద్ద హరివాణం దగ్గర, హొళగుంద మండలం మార్లమడికి గ్రామం దగ్గర, హాలహర్వి మండలం ఛత్రగుడి దగ్గర.. ఇలా 8 చోట్ల అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టుల వద్ద పోలీసు, రెవెన్యూ, సెబ్ తదితర శాఖల అధికారుల బృందాలు 24 గంటల పాటు విధుల్లో ఉంటూ వాహనాలను తనిఖీ చేస్తారు. ప్రతి నియోజకవర్గంలో సర్వైలెన్ టీంలు, మండలానికి ఒక వీడియో సర్వైలెన్ టీమ్ ఏర్పాటు చేశారు. ఈ బృందాలు నిత్యం పెట్రోలింగ్ చేస్తూ ఎక్కడి నుంచి సమాచారం అందినా తక్షణం సంఘటనకు చేరుకొని విచారణ జరిపి చర్యలు తీసుకుంటాయి. అయితే.. ఈ చెక్ పోస్టు వద్ద సీఐ, ఎస్ఐ స్థాయి అధికారి పర్యవేక్షణలో నిత్యం తనిఖీతలు నిర్వహించాల్సి ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

దుఃఖంతోనే పరీక్షకు హాజరైన మనుమరాలు

కోడుమూరు (రూరల్), మార్చి 18: మండలంలోని కొత్తూరు వద్ద సోమవారం ఉదయం కారు ఢీకొన్న ఘటనలో ములకల మిద్దె రామయ్య(65) అనే వృద్ధుడు దుర్మరణం చెందాడు. రామయ్య ఉదయం కల్లందొడ్డిలో పశువులకు నీళ్ల తీసుకరావడానికి రోడ్డుకు ఇవతలి వైపున మినీ ట్యాంకు వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచి నీటి బిందెను భుజంపై ఎత్తుకుని రోడ్డు దాటుతుండగా కర్నూలు వైపు నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో రామయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు కారును అడ్డగించి పోలీసులకు సమాచారం అందించారు. కారులో ఉపాధ్యాయులు ఉన్నట్లు తెలిసింది. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్టేషన్ చేర్చారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య అనంతమ్మ, కొడుకు ఉన్నారు.


రామయ్య (ఫైల్)

- **అటు తాత మరణం..ఇటు పరీక్ష:** పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న రామయ్య మనవరాలు తేజశ్విని గంగమ్మ ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు చేసి ఆలయం బయటికి వచ్చింది. సమీపంలో బస్ షెల్టర్ వద్ద రోడ్డుపై జనం గుమికూడిన దృశ్యం ఆమె కంటబడింది. ఆదుర్దాగా అక్కడికి వెళ్లి చూడగా తీవ్రగాయాలతో తాత కనిపించాడు. అక్కడికి కుటుంబ సభ్యులంతా చేరుకున్నారు. అంత దుఃఖంలో కూడా తేజశ్వని తోటి విద్యార్థులతో పరీక్షకు వెళ్లింది.


పది పరీక్షకు హాజరైన తేజశ్విని

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గోనెగండ్ల, మార్చి 18: చిన్నమరివీడు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కురువ అయ్యస్వామి(42) విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. గ్రామంలో మారెమ్మ దేవర సందర్భంగా అయ్యస్వామి బావమరిది వీరేష్ గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర చెరుకు రసం అమ్మే దుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం రాత్రి వ్యాపారం ఎట్లా ఉందని అడిగేందుకు వీరేష్ దగ్గరికి వెళ్లాడు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర విద్యుత్ వైర్ తెగిపడి ఉన్నదాన్ని గమనించని అయ్యస్వామి దాన్ని తగలడంతో కరెంట్ షాక్ కొట్టి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గ్రామస్థులు వెంటనే చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు సోమవారం తెల్లవారుజామున అయ్యస్వామి మృతి చెందాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు.

రెసిడెన్షియల్ కళాశాలల్లో ప్రవేశాలకు

దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 18: ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ల్లో 2024-25 ప్రవేశాలకు రాయలసీమ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఆర్‌జేసీ కర్నూలు జిల్లా సమన్వయ కర్త డాక్టర్ శ్రీనివాసగుప్త తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మార్చి 31వ తేదీలోపు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇంటర్ మీడియెట్ మొదటి సంవత్సరం(ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపులకు) రాయలసీమ జిల్లాకు చెందిన బాలికలు మాత్రమే బనవాసి ఏపీఆర్‌జేసీ కళాశాలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. అలాగే రాయలసీమ బాలురు గ్యారంపల్లి, కొడిగెనహళ్లి, నాగార్జున సాగర్ ఏపీఆర్‌జేసీ కళాశాలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఒకేషనల్ విద్యార్థులు నిమ్మకూర్‌కు దరఖాస్తు చేసుకోవాలని, ఏపీఆర్‌డీసీ నాగార్జునసాగర్‌కు బీఏ మొదటి సంవత్సరం, బీకం, బీఎస్సీ గ్రూప్‌లకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్ పరీక్ష 25.04.2024 మధ్యాహ్నం 2.30 నుంచి 5.00 గంటల వరకు ఉంటుందని అన్నారు. అలాగే 5,6,7,8 వ తరగతులకు ఏపీఆర్ఎస్ క్యాట్ ఏప్రిల్ 25న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

బుగ్గన అసెంబ్లీలో అడుగు పెట్టలేరు

- ఇఫ్తార్ విందుకు పిలిచి వైసీపీ కండువాలు వేయడమా...?
- ముస్లింల మనోభావాలను దెబ్బతీసిన మంత్రి
- కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, మార్చి 18: మంత్రి బుగ్గన ఇప్పటి వరకు ప్రజలను మభ్యపెడుతూ గెలిచారని, రాబోయే ఎన్నికల్లో అసెంబ్లీలో అడుగు పెట్టలేరని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో ఆయన మాట్లాడుతూ మంత్రి బుగ్గన ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి రాత్రికి రాత్రే డోన్ ఈద్గా మసీదు కమిటీని నియమిస్తూ ఎలా జీవో జారీ చేయిస్తారని ప్రశ్నించారు. ఎన్నికల తర్వాత మతపెద్దలు మాట్లాడుకుని కమిటీలు నియమించుకోవాలే తప్ప.. ఇలా రాజకీయం చేయడం మంత్రి బుగ్గనకు తగదన్నారు. ముస్లిం మైనార్టీల ఇఫ్తార్‌విందులో మంత్రి బుగ్గన రాజకీయం చేస్తూ ముస్లింలకు వైసీపీ కండువాలు కప్పడం చాలా దారుణమన్నారు. పవిత్రమైన రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందును అపవిత్రపరిచి ముస్లిం మైనార్టీల మనోభావాలను మంత్రి బుగ్గన దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి బుగ్గన ఫ్లెక్సీలు డోన్‌లో ఇంకా కనిపిస్తున్నాయని, అధికారులు వైసీపీ బోర్డులను తొలగించాలని, లేకుంటే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. మంత్రి బుగ్గన తానొక్కడే అభివృద్ధి చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని, ఆయన మాటలు ఇక డోన్ నియోజకవర్గ ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగైడు, ముస్లిం మైనార్టీ నాయకులు అన్వర్‌భాషా, ఎస్ఎండీ రఫీ, అన్వర్, నూర్, మద్రి రమణ, భాస్కర్ నాయుడు, గోపాల్ రెడ్డి, ఓంప్రకాష్, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, హేమసుందర్ రెడ్డి, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

ఎన్నికల ఫిర్యాదులను పరిష్కరించండి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 18: వివిధ మాధ్యమాల ద్వారా ఎన్నికలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డా.జి.సృజన పేర్కొన్నారు. సోమవారం సాధారణ ఎన్నికలు-2024 నిర్వహణలో భాగంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ సెల్, జిల్లా స్థాయి కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేశారు. కమ్యూనికేషన్ సెంటరులో సంబంధిత అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంసీఎంసీ సెల్‌లో ఎలక్ట్రానిక్, ప్రింట్, సోషల్ మీడియాల్లో వచ్చే పెయిడ్ న్యూస్ పరిశీలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. వీటిపై రిజిస్టర్లు నిర్వహించాలని, రోజువారి నివేదికలను తయారు చేయాలని సూచించారు. ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాల్లో రాజకీయ ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. జిల్లా కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్‌లో ఓటరు హెల్ప్‌లైన్ నెంబర్.1950, టోల్‌ఫ్రీ నెంబర్, ల్యాండ్‌లైన్ నెంబర్, వాట్సాప్ నెంబర్, టీవీ స్క్రోలింగ్, సోషల్ మీడియాల ద్వారా ఫిర్యాదులు రాగానే సంబంధిత ఫార్మాట్లలలో రూపొందించి మెయిల్ ద్వారా సెక్టార్ అధికారులు, సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, రిటర్నింగ్ అధికారులకు పంపించాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ రూం.24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. ఫిర్యాదులను 24 గంటలలోపు పరిష్కరించాలన్నారు. ప్రతి రోజు ఎంసీఎంసీ ఫిర్యాదులు సెల్‌కి సంబందించిన నివేదికలు పంపాలని సీపీవోను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు పార్లమెంటు నోడల్ అధికారిగా జేడీ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 18: భారత ఎన్నికల కమిషన్ రెండు రోజుల క్రితం కర్నూలు అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో జిల్లా అధికార యంత్రాంగం అవసరమైన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కర్నూలు జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వరలక్ష్మిని కర్నూలు పార్లమెంటు స్థానిక సింగిల్ విండో పర్మిషన్ సెల్, క్యాండిడేట్ లైజనింగ్ సెల్‌కు నోడల్ అధికారిగా నియమిస్తూ కలెక్టర్ డా.జి.సృజన ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంటు స్థానానికి పోటీ చేయబోయే అభ్యర్థులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు చేపట్టబోయే కార్యక్రమాలు ముందుగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నుంచి పర్మిషన్ తీసుకోవాలి. ర్యాలీలు, పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, లౌడ్ స్పీకర్లు తదితర వాటికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సిందే. రాజకీయ పార్టీల అభ్యర్థులు సింగిల్ విండో పర్మిషన్ సెల్, క్యాండిడేట్ లైజనింగ్ సెల్‌కు తాము చేపట్టబోయే కార్యక్రమాలకు సంబంధించి దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవాలి. అభ్యర్థులు రాజకీయ పార్టీల నాయకులు సమర్పించే దరఖాస్తులను నోడల్ అధికారి వరలక్ష్మి పరిశీలించి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారికి పంపిస్తారు. కలెక్టర్ ఆమోదిస్తేనే ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించుకోవాలి.



పెద్దాసుపత్రిలో డీఎంఈ అధికారుల విచారణ

కర్నూలు(హాస్పిటల్), మార్చి 18: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో స్టేషనరీ అక్రమాలపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) అకౌంట్ ఆఫీసర్లు భాస్కర్‌రావు, భూపాల్ సోమవారం విచారణ చేపట్టారు. ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు, సిబ్బంది, ఫార్మసీ అధికారులు, కార్యాలయ అధికారులను వారు విచారణ చేశారు. ఆసుపత్రిలో స్టేషనరీ కొనుగోలులో అవకతవకలు జరిగాయని గతంలో ఓ ఉద్యోగిని సస్పెండ్ చేశారు. ఏడీ రమేష్‌బాబును సరెండర్ చేశారు. దీనిపై విచారణకు ఆదేశించారు. గతంలో పని చేసిన ఫార్మసీ సూపర్‌వైజర్‌తో పాటు అప్పటి ఏడీలను కూడా అధికారులు విచారణ చేశారు.

క్రిష్ణగిరిలో గ్రానైట్ క్వారీ పరిశీలన

కర్నూలు(అర్బన్), మార్చి 18: క్రిష్ణగిరిలో కొత్తగా గ్రానైట్ తవ్వకాల కోసం మరో ప్రాంతాన్ని పరిశీలించామని గనుల శాఖ డీడీ రాజశేఖర్ తెలిపారు. సోమవారం విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడుతో కలిసి తనిఖీలు నిర్వహించారు. క్రిష్ణగిరి మండల పరిధిలో కొత్తగా గ్రానైట్ నిల్వలు ఉన్నట్లు దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. అందులో భాగంగానే తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ తనీఖీల్లో సూపర్‌వైజర్ గోవిందరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు చదువులో రాణించాలి


నందికుంట పాఠశాలలో మాట్లాడుతున్న వీఆర్వో కృష్ణారెడ్డి

కొత్తపల్లి, మార్చి 18: బాలికలు బాగా చదువుకుని అన్ని రంగాల్లో విజయం సాధించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ అన్నారు. సోమవారం మండలంలోని నందికుంట మండల పరిషత్ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో హెచ్‌ఎం సుధ, రెవెన్యూ అధికారి క్రిష్ణారెడ్డిల పర్యవేక్షణలో భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరమ్మ మాట్లాడుతూ లింగ వివక్షత లేకుండా ఆడపిల్లలను కూడా మగ పిల్లలతో సమానంగా చదివించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీలు ప్రసాద్, రాఘవేంద్ర, మహిళా పోలీసు మోతియాబేగం, అంగన్‌వాడీ వర్కర్లు శ్రీదేవి, పద్మావతి, శ్రావణి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

బండిఆత్మకూరు, మార్చి 18: ఆత్మకూరు డిపోకు చెందిన పలు ఆర్టీసీ బస్సులకు వైసీపీ సిద్ధం స్టిక్కర్లు ఇంకా తొలగించలేదు. ఆత్మకూరు ఆర్టీసీ బస్సులు మాత్రం సీఎం జగన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఫొటోల ఉన్న స్టిక్కర్లతోనే రాకపోకలు చేస్తుండడం గమనార్హం. ఎన్నికల అధికారులు ఆర్టీసీ బస్సులపై దృష్టి సారించి స్టిక్కర్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి గ్రామోత్సవం

నంద్యాల (నూనెపల్లె), మార్చి 18 : నంద్యాలలోని మూలసాగరంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి గ్రామోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు పాల్గొన్నారు.

వైభవంగా కురుకులాంబ జయంతి వేడుకలు


ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు రూరల్, మార్చి 18: ఆత్మకూరు మండలం కురుకుంద గ్రామంలో వెలసిన కురుకులాంబదేవి ఆలయంలో వార్షిక మహోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం కురుకులాంబ అమ్మవారి జయంతి వేడుకలను ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. మహోత్సవ వేడుకల్లో భాగంగా ఉదయం కురుకులాంబ అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయపురోహితులు కృష్ణమోహన శర్మ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమార్చనలు,అమ్మవారికి వడి బియ్యం సమర్పణ, సామూహిక సహస్రపారాయణ హోమాలు నిర్వహించారు.

అల్లర్లకు పాల్పడితే అణచివేస్తాం


రేగడగూడూరు గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

బండిఆత్మకూరు, మార్చి 18: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అల్లర్లకు పాల్పడినా ఎంతటి వారినైనా అణచివేస్తామని ఎస్‌ఐ మల్లికార్జున హెచ్చరించారు. సోమవారం మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన శింగవరం, భోజనం గ్రామాల్లో నంద్యాల డీఎస్పీ రవింద్రనాథ్‌రెడ్డి, రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఎస్‌ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ప్రశాంత ఎన్నికలకు గ్రామాల్లో అందరూ సహకరించాలన్నారు. ఎవరైనా తమ ప్రాబల్యం కోసం అనవసరంగా అమాయకులను బలిచేస్తే సహించే ప్రసక్తే ఉండదన్నారు. స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

వెలుగోడు, మార్చి 18 : రానున్న ఎన్నికల దృష్ట్యా మండలంలోని రేగడగూడూరు, అబ్దుల్లాపురం వేల్పనూరు గ్రామాలలో బీఎస్‌ఎఫ్, డీఎస్పీ పంకజ్‌కుమార్, ఎస్‌ఐ భూపాలుడు ఆధ్వర్యంలో సాయుధ దళాల కవాతు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రశాంత వాతవరణంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా ఆయా గ్రామాలలోని ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటు హక్కు కల్గిన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధం

పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరితారెడ్డి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న గౌరుచరిత

గడివేముల, మార్చి 18: రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలనను అంతం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌరుచరితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆమె ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. సూపర్-6 పథకాలను ప్రజలకు వివరించారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ కల్లోలం ఏర్పడిందని అన్నారు. ఇసుక, మైనింగ్‌లను వైసీపీ నాయకులు యథేచ్ఛగా కొల్లగొట్టారని అన్నారు. అన్యాయాలను, అక్రమాలను ప్రశ్నించిన వారిపై దాడులు చేసి అక్రమ కేసులు బనాయించారని అన్నారు. వైసీపీ పాలనలో రైతులకు గిట్టుబాటు ధర లేదని అన్నారు. అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులు పంట సాగుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయని అన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దేశం సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ సీతారామిరెడ్డి, మాజీ కో-ఆప్షన్‌మెంబర్ రఫిక్, టీడీపీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కృష్ణయాదవ్, వడ్డు లక్ష్మీదేవి, సుభద్రమ్మ, గని హర్ష, శ్రీనివాసులు, రాజునాయక్, రంగస్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి విజయంతోనే బీసీల సంక్షేమం

- **శ్రీశైలం నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి**

ఆత్మకూరు, మార్చి 18: రాబోయే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తే బీసీల సంక్షేమం సాధ్యపడుతోందని శ్రీశైలం నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆత్మకూరు మండలంలోని రెండు క్లస్టర్ల నాయకులతో జయహో బీసీ సదస్సును నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతోనే ఆనాడు దివంగత ఎన్టీఆర్ బీసీల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు గుర్తుచేశారు. మహిళలకు ఆస్తిహక్కు, స్థానిక సంస్థల్లో బడుగులకు రిజర్వేషన్లు కల్పించి వారి అభ్యున్నతికి కృషిచేశారని చెప్పారు. అయితే 33శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను సీఎం జగన్ 23శాతానికి తగ్గి బీసీలకు ద్రోహం చేశారని మండిపడ్డారు. టీడీపీ పాలనలోనే బీసీల సంక్షేమం సాధ్యపడిందని గుర్తుచేశారు. ఇదిలావుంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయంతోనే బీసీల అభ్యున్నతి ఉంటుందని భరోసా ఇచ్చారు. ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వైఫల్యాలను, అక్రమాలను ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, క్లస్టర్ ఇన్‌చార్జ్ మల్లికార్జునరెడ్డి, ఆ పార్టీ నాయకులు రామనర్సయ్య, దగ్గుపాటి శ్రీనివాసులు, రవీంద్రబాబు, నాగార్జున, నగరి లక్ష్మీ, రూతమ్మ, వెంకట్రావ్, శరత్ తదితరులు ఉన్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ సేవ


వెండి రథంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు


నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, మార్చి 18: శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేశారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్చారణలతో పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై ఆశీనులనుజేసి ప్రత్యేక పూజలు, మంగళహారతులు జరిపి ఆలయ ప్రాంగణంలో రథోత్సవాన్ని నిర్వహించారు.

- **అలరించిన నిత్యకళారాధన**

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా సోమవారం గుంటూరుకు చెందిన నాగశ్రీ ప్రవళ్లిక బృందంచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, శంభో శివ శంభో, శివస్తుతి, దేవిస్తుతి, ప్రణవనాదం, అదిగదిగో శ్రీశైలం తదితర గీతాలకు హరి, అనన్య, జస్విత, స్నేహిత, లలిత, లాస్య, మృదిని, నిఖితసాయిలీల, లౌక్యశ్రీ తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

ఎస్పీని కలిసిన డీఎఫ్‌ఓ


ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డికి పూలమొక్కను అందజేస్తున్న డీఎఫ్‌ఓ పి.శివశంకర్‌రెడ్డి

నంద్యాల క్రైం, మార్చి 18 : సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూలు జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్‌ఓ)గా పని చేస్తున్న పి.శివ శంకర్‌రెడ్డిని ప్రభుత్వం నంద్యాల జిల్లాకు బదిలీ చేసింది. దీంతో ఆయన నంద్యాల డీఎఫ్‌ఓగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పి.శివశంకర్‌రెడ్డికి పూలమొక్కను అందించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఆత్మకూరు రూరల్, మార్చి 18: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కొట్టాల చెరువు పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుప్రవళ్లిక గిరిజన మహిళలకు సూచించారు.సోమవారం ఆత్మకూరు మండలం నల్లమలలోని పెచ్చెరువు గూడెంలో కొట్టాల చెరువు పీహెచ్‌సీ వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులకు, గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వోలు విజయ లక్ష్మి, తులసి, మల్లిక, మౌనిక,హెల్త్ అసిస్టెంట్ సామక్క పాల్గొన్నారు.

నేడు శ్రీశైలం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

ఆత్మకూరు, మార్చి 18: ఆత్మకూరు పట్టణంలోని ఎంఎం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం 10గంటలకు శ్రీశైలం నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్ రెడ్డి, వేణుగోపాల్ పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ.. శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల టీడీపీ అధ్యక్షులు, యూనిట్, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్లు, వివిధ అనుబంధ కమిటీ సభ్యులు, వార్డు, గ్రామ అధ్యక్షులతో పాటు మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ శ్రేణులు హాజరుకావాలని కోరారు. ఈసమావేశంలో ప్రధానంగా రాబోయే ఎన్నికల్లో మూడు పార్టీల శ్రేణులు ఏవిధంగా ముందుకెళ్లాలన్న అంశాలను సమావేశంలో చర్చించనున్నట్లు వెల్లడించారు.

ప్రజాగళం ఘన విజయం కూటమిదే


సమావేశంలో మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు రూరల్ మార్చి18 : రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేట్టిన ప్రజాగళం బహిరంగ సభ ఘనవిజయం సాధించడం టీడీపీ ,జనసేన, బీజేపీ పట్ల ప్రజలు చూపుతున్న అభిమానానికి నిదర్శనం అని నంద్యాల జిల్లా టీడీపీ నాయకులు మాండ్ర శివానందరెడ్డి అన్నారు. సోమవారం నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో మాండ్ర నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజాగళం బహిరంగ సభ విజయవంతంగా రాష్ట్రంలో సరికొత్త చరిత్ర సృష్టించందని మాండ్ర శివానందరెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అప్పట్లో తెలుగుదేశం ప్రభుత్వం 72 శాతం పోలవరం పూర్తి చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తెలుగుదేశం ,జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాబోతున్నాయని అన్నారు. ఈ బహిరంగ సభ విజయవంతమైనందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి జయసూర్య, గుండం రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జనసేన శ్రేణులు పొత్తు ధర్మాన్ని అనుసరించాలి


మాట్లాడుతున్న శ్రీశైలం నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు ధూపం అభిమన్యుడు

ఆత్మకూరు, మార్చి 18: రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నిర్ణయించిన అభ్యర్థులను గెలిపించేందుకు జనసేన శ్రేణులు పొత్తు ధర్మాన్ని తప్పనిసరిగా అనుసరించాలని శ్రీశైలం నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు ధూపం అభిమన్యుడు, ఉమ్మడి కర్నూలు జిల్లా జనసేన పార్టీ ప్రచార కమిటీ కన్వీనర్ కర్నాటి శ్రీరాములు పేర్కొన్నారు. సోమవారం ఆత్మకూరులోని చౌడేశ్వరీ కళ్యాణ మండపంలో మండల జనసేన పార్టీ శ్రేణులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అలాగే ఆయా గ్రామాల్లో జనసేన పార్టీ స్థితిగతుల గురించి ఆరా తీశారు. అంతేకాకుండా టీడీపీ, జనసేన నాయకుల మధ్య సమన్వయం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గం మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా బుడ్డా రాజశేఖరరెడ్డి విజయానికి శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. క్రమంలో పార్టీ శ్రేణులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు బొజ్జా శేషకుమార్ శేషు, పురం హరీష్, సుధాకర్, శేషగౌడ్, నవీన్ నాయక్, చంద్రశేఖర్ రెడ్డి, మంగన్న, ఇంతియాజ్, జ్యోతీష్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

సైకిలెక్కిన వైసీపీ నాయకులు


వైసీపీని వీడి టీడీపీలో చేరిన నాయకులతో ఫరూక్

నంద్యాల రూరల్ మార్చి 18: నంద్యాల మండలంలోని అధికార పార్టీకి చెందిన చాపిరేవుల గ్రామ వైసీపీ మాజీ ఉపసర్పంచ్ బిజ్జల బాలస్వామి రెడ్డి సోమవారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వీరికి నంద్యాల తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఉప సర్పంచ్‌తో పాటు ఆయన కుమారుడు బిజ్జల శేఖర్ రెడ్డి, వారి అనుచరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ వైస్సార్సీపీ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ ప్రారంభమైందన్నారు. అధికారంలోకి రాక ముందు ఎన్నో హామీలు ఇచ్చిన వైసీపీ అధికారంలోకి వచ్చాక 30 శాతం హామీలు కూడా నెరవేర్చలేకపోయిందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే అభివృద్ధిని పరుగులు తీయిస్తామని హామీ ఇచ్చారు. 2024 ఎన్నికల్లో టీడీపీకి అత్యధిక మెజారిటీ కట్టబెట్టి తనను చంద్రబాబు నాయుడిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల టీడీపి అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంట నిర్వాహకులపై డీఎస్పీ విచారణ

నందికొట్కూరు, మార్చి 18: మిడ్తూరు పోలీస్‌స్టేషన్‌లో ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసులు వంట నిర్వాహకులపై విచారణ చేపట్టారు. గతంలో మిడ్తూరు జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులుగా నిచేస్తున్న వారి అకౌంట్ నుంచి వారికి తెలియకుండా నగదు డ్రా చేశారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో బాధితులను మిడ్తూరు పోలీస్టేషన్‌లో డిఎస్పీ విచారణ చేశారు. కార్యక్రమంలో ఎస్.ఐ జగన్మోహన్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రారంభమైన పది పరీక్షలు


ఆత్మకూరులో నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

జిల్లాలో పది పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పరీక్ష హాలులో ఒక బెంచ్‌పై ఇద్దరు విద్యార్థులను కూర్చోబెట్టి పరీక్షలు రాయించారు. కొన్ని పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన బెంచీలు కూడా చిన్నవిగా ఉండటంతో విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారు. పాఠశాలల్లో ఫ్యాన్లు ఉన్నా పని చేయలేదు. దీంతో పరీక్ష టెన్షన్‌కు తోడు ఎండవేడిమి, ఉక్కపోతతో విద్యార్థులు ఉక్కిరిబిక్కిరయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో సకాలంలో రవాణా సౌకర్యాలు లేక విద్యార్థులు సొంత గ్రామాల నుంచి తల్లి దండ్రులతో ద్విచక్రవాహనాలు, ఆటోలలో సామర్థ్యానికి మించి పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు.


బండిఆత్మకూరులో నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

ఆత్మకూరు, మార్చి 18: ఆత్మకూరు మండలంలో సోమవారం ప్రారంభమైన పది పరీక్షలకు మొత్తం 1361 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి జానకీరామ్ పేర్కొన్నారు. తెలుగు, ఉర్దూ సబ్జెక్ట్‌లకు సంబంధించి మొత్తం 1472 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 111 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కాగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికల హైస్కూల్, శ్రీచైతన్య హైస్కూల్, గౌతమ్ హైస్కూల్, జెడ్పీ ఉర్దూ హైస్కూల్, డీహైస్కూల్, శ్రీపద్మావతి హైస్కూల్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

నందికొట్కూరు: పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తెలుగు పరీక్షను విద్యార్థులు రాశారు. నందికొట్కూరు పట్టణంలో 6 పరీక్షా కేంద్రాల్లో 1129 మంది విద్యార్థులకు గాను 1975మంది విద్యార్థులు హాజరయ్యారు.

గోస్పాడు : గోస్పాడు మండలంలో సోమవారం పదో తరగతి పరీక్షలు మొదలయ్యాయి. మండలంలో 592 మంది విద్యార్థులకు గాను 552 మంది పరీక్షకు హాజరవ్వగా 40 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

గడివేముల: మండంలో సోమవారం పదోతరగతి పరీక్షలు పకడ్బందీగా ప్రారంభమయ్యాయి. 411 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 316 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని గోకవరం, కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన పది పరీక్ష కేంద్రాల్లో మొదటి రోజు 51 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా సెంటర్ల చీఫ్ ఎగ్జామినర్లు రఘుస్వామి, ఇబ్రహీం తెలిపారు.

పాణ్యం : మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని నాలుగు కేంద్రాలలో సోమవారం జరిగిన పరీక్షల్లో 1003 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 955 మంది హాజరయ్యారు.

బండిఆత్మకూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. బండిఆత్మకూరు హైస్కూల్‌లో 217 మందికి గాను 196 మంది, మోడల్ స్కూల్‌లో 204కు గాను181 మంది, సంతజూటూరు హైస్కూల్‌లో 97కు గాను 69మంది హాజరైనట్లు ఎంఈవో మోహన్‌రెడ్డి, పరీక్షల అధికారులు తెలిపారు

నందికొట్కూరు రూరల్ : మండలంలోని బ్రాహ్మణకొట్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది పరీక్షలకు 168 మంది విద్యార్థులకు గాను 159 మంది పరీక్షలకు హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ అధికారి వెంకటస్వామి తెలిపారు. విజ్‌డమ్ పాఠశాల కేంద్రంలో మొత్తం విద్యార్థులు 118 ఉండగా అందులో 105 మంది పరీక్షలకు హాజరయ్యాయరని పరీక్షా కేంద్రం చీఫ్ అధికారి శ్రీధర్ రెడ్డి తెలిపారు.

పాములపాడు: మండలంలో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. పాములపాడులోని ఎఎస్ఆర్ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్ష కేంద్రంలో 198 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 188 మంది హాజరయ్యారు. స్థానిక మోడల్ స్కూల్‌లో 247 మంది విద్యార్థులకు గాను 221 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ బాలాజీ నాయక్ తెలిపారు.

జూపాడుబంగ్లా: మండల కేంద్రం జూపాడుబంగ్లాలో సోమవారం పదీప రీక్షలు ప్రారంభమయ్యాయి. మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా మొత్తం రెగ్యులర్ విద్యార్థులు 463 పరీక్ష లు రాయాల్సి ఉండగా 417 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు పరీక్ష నిర్వాహకులు తెలిపారు.

పగిడ్యాల: పగిడ్యాల జెడ్పి పాఠశాలలో 174 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సిఉండగా 170 మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్షల నిర్వాహణాధికారి మధుసూదన్ తెలిపారు. ముచ్చుమర్రి పరీక్ష కేంద్రంలో 127 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావల్సివుండగా 118 మంది హాజరైనట్లు పరీక్షల నిర్వాహణాధికారి సలాం బాషా తెలిపారు. లక్ష్మాపురం అంచె సమీపంలోని గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రంలో 192 మంది విద్యార్థులకు 186 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు.


నందికొట్కూరులో క్యూలైన్‌లో విద్యార్థులు


జూపాడుబంగ్లాలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు


పగిడ్యాలలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ఉపాధ్యాయ అక్రమ బదిలీలు అన్యాయం



నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

బనగానపల్లె, మార్చి 18: రాష్ట్రంలో ఉపాధ్యాయుల అక్రమ బదిలీలపై సోమవారం యూటీఎఫ్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ప్రతాప్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్ దస్తగిరి, జిల్లా సహాధ్యక్షుడు సత్యప్రకాశ్‌లు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పోరాటాలతో సాధించుకున్న కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ ప్రభుత్వం అక్రమ బదిలీలు చేపట్టడం దారుణమన్నారు. అక్రమ బదిలీల సిఫారసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.సతీశ్, ఆర్ వీరకుమార్‌రెడ్డి, బీ.సుధాకర్, సుంకన్న, మనోహర్ పాల్గొన్నారు.

సీఎం బొమ్మను మూసివేశారు



ప్రచార బోర్డుకు పేపర్లు అతికించిన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రుద్రవరం, మార్చి 18 : ప్రచార బోర్డులో సీఎం బొమ్మను మూసివేశారు. రుద్రవరంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైంది. మండల ఎన్నికల అధికారులు స్పందించారు. తహసీల్దారు మురళీమోహన్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళికి లోబడి పనిచేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నాయకుల, ప్రజాప్రతినిధుల ఫొటోలను, పత్రాలను తొలగించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే అందుకు చర్యలు తప్పవన్నారు.

విగ్రహాలకు ముసుగు

చాగలమర్రి, మార్చి 18: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండల కేంద్రంలో అభ్యర్థుల ప్రచార ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు, శిలాఫలకాలకు ముసుగు వేశారు. గ్రామ వీఆర్ఏలు గ్రామాల్లో పర్యటించి బ్యానర్లు, జెండాలను తొలగించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో నాయకుల చిత్రాలను తొలగించాలని కార్యదర్శులకు ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి ఆదేశించారు.

ఎన్నికల కోడ్‌లో రోడ్డు వేస్తారా?



గోనంపల్లెలో సీసీ రోడ్డు నిర్మాణానికి కంకర తోలిన దృశ్యం

రుద్రవరం, మార్చి 18: ఎన్నికల కోడ్ ఉల్లంఘించి సీసీ రోడ్డు నిర్మించడానికి కంకర తోలిచదను చేస్తారా అని టీడీపీ నాయకులు ఎర్రం ప్రతాప్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలైన తరువాత ఎలాంటి అబివృద్ధి పనులు చేయరాదని, ఇది అధికారులకు తెలియదా ప్రశ్నించారు. రుద్రవరం మండలంలోని పెద్దకంబలూరు పంచాయతీ మజరా గోనంపల్లె గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించేందుకు కంకర పరిచారని విమర్శించారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ ఏఈ వెంకటరాముడు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలు కంటే ముందే మట్టి పనులు ప్రారంభించామని తెలిపారు.

ఎన్నికల కోడ్ పాటించండి: తహసీల్దార్



మాట్లాడుతున్న తహసీల్దారు రవికుమార్

ఉయ్యాలవాడ, మార్చి 18: అన్ని శాఖల అధికారులు ఎన్నికల కోడ్‌ను తప్పని సరిగా పాటించాలని తహసీల్దారు వెంకటరమణ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో విద్యా, వైద్యం, ఐసీడీఎస్ అధికారులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆయా కార్యాలయాల్లోని రాజకీయ నాయకుల ఫోటోలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించి, విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. కోడ్ ఉల్లంగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రీ సర్వే డిటీ తులసీక్రిష్ణ, ఆర్ఐ సత్తార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప్తి, పెద్దయమ్మనూరు పీహెచ్‌సీ వైద్యురాలు విజయదుర్గ, ఎంపీహెచ్‌ఈవో దస్తగిరి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళికి లోబడి పని చేయాలి

రుద్రవరం, మార్చి 18: ఎన్నికల నియమావళికి లోబడి పనిచేయాలని కార్యదర్శులకు మండల ఎన్నికల కోడ్ ఆఫ్ అధికారి రామచంద్ర అన్నారు. సోమవారం రుద్రవరంలో పర్యటించారు. శిలాఫలకాలకు ముసుగులు వేసిన వాటిని పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలైన 24గంటల్లోపు కార్యాలయాల్లో ప్రజా ప్రతినిధుల ఫొటోలు తొలగించాలని, 52 గంటల్లోపు ప్రైవేటు, పబ్లిక్ స్థలాల్లో ఉన్నజెండాలను ఫ్లెక్సీలను,బ్యానర్లను, 72 గంటల్లోపు ప్రైవేటు స్థలాల్లో ఉన్న జెండాలు, ఫ్లెక్సీలు,బ్యానర్లు తొలగించాలన్నారు. జెండాలు పెట్టుకోవాలంటే అనుమతులు ఉండాలన్నారు. నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. సమావేశంలోఈవోపీఆర్‌డీ శ్రీనివాసశర్మ, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

చంద్రబాబుతోనే బీసీలకు న్యాయం

దొర్నిపాడు, మార్చి 18: రాష్ట్రంలో టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ మండలాధ్యక్షుడు భూమా బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దొర్నిపాడు బీఎస్ఆర్ గోడౌన్ నందు బీసీ సాధికార సమితి సమావేశం నిర్వహించారు. టీడీపీ యువ నాయకుడు భూమా సందిప్ రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తేనే యువత, పేదలు, మహిళలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లేశ్వరచౌదరి, జగదీశ్వర్‌నాయుడు, లింగుట్ల వెంకట్‌నాయుడు, డీలర్ రమణయ్య, హబీబ్‌బాషా, సిద్ధి సత్యం, అమరసాని రవి, చలుంగారి అంకన్నయాదవ్ తదితరులు ఉన్నారు.

కరువు మండలంగా ఉయ్యాలవాడ

ఉయ్యాలవాడ, మార్చి 18: ఉయ్యాలవాడ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినట్లు మండల వ్యవసాయ అధికారి రాజేంద్ర సోమవారం తెలిపారు. రబీ సీజన్‌లో వర్షాలు లేక పంట సాగు గణనీయంగా తగ్గిందన్నారు. అందువల్ల ఉయ్యాలవాడ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

ప్రజాగళం ఘన విజయం

- టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదే అధికారం
- మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

కోవెలకుంట్ల, మార్చి 18: చిలకలూరుపేటలో ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగళం సభకు లక్షలాది మంది జనం హాజరై ఈసభను విజయవంతం చేశారని బనగానపల్లె నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం కోవెలకుంట్ల పట్టణంలోని సాయినగర్ కాలనీలో బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని టీడీపీ సూపర్ సిక్స్ మ్యానిఫెస్టో కరపత్రాలు ఇంటింటికీ పంపిణీ చేశారు. బీసీ మాట్లాడుతూ ఈ 5 ఏళ్లలో జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందని విమర్శించారు. జగన్ అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఏపీ ప్రజలు నిర్ణయించుకున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని తరిమి కొట్టేందుకు ప్రజాగళం సభకు లక్షల్లో జనం వచ్చి తమ మద్దతు తెలిపారన్నారు. జగన్ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. జగన్ ప్రభుత్వాన్ని ప్రజలే దించుతారన్నారు. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు అవినీతిలో పోటీపడుతున్నారన్నారు. జగన్ ప్రభుత్వం అందరినీ మోసం చేసిందన్నారు. ఉద్యోగ, ఉపాధి లేక నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగావకాశాలు కల్పించడంలో సీఎం విఫలమయ్యారన్నారు. జగన్ పాలనలో ఆర్థిక దుర్వినియోగం, అవినీతికి మారుపేరుగా మారిందన్నారు సచివాలయాన్ని, కలెక్టరేట్ కార్యాలయాలు, రైతుబజార్ భవనాలు, ప్రభుత్వ కళాశాలలతో సహా అనేక ప్రభుత్వ ఆస్తులను తనఖా పెట్టిందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధిస్తుందన్నారు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రానుందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఏపీలోని 20లక్షల నిరుద్యోగులకు ఉపాధి, ప్రతి నిరుద్యోగికి యువగళం నిధి కింద నెలకు రూ.3వేలు పంపిణీ చేస్తామని బీసీ పేర్కొన్నారు. చంద్రబాబు ప్రకటించిన ఆరు పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రజలు బీసీ అభిమానులు పాల్గొన్నారు.



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ



కోవెలకుంట్లలో బజ్జీల అంగడి వద్ద మాజీ ఎమ్మెల్యే బీసీ

కమలాపురం దర్గాలో బీసీ పూజలు

బనగానపల్లె: కడప జిల్లా కమలాపురం దర్గాలో బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. దర్గాలో పూలచద్దర్ సమర్పించారు. పీఠాధిపతి ఫైజల్ గఫార్ షాఖాద్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. పీఠాధిపతి బీసీకి పూలమాలలు వేసి శాలువలతో సత్కరించారు.

● కోవెలకుంట్ల పట్టణంలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా సోమవారం సూపర్‌సిక్స్ పథకాలను మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ప్రజలకు వివరించారు. ఇందులో భాగంగా బజ్జీల దుకాణం వద్ద బజ్జీ నిర్వాహ కుడితో బీసీ మాట్లాడి బజ్జీలు వేశారు.

జగన్ జైలుకెళ్లడం ఖాయం

- వైసీపీ అవినీతి ప్రధానికి తెలుసు
- డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



డోన్‌లో పర్యటిస్తున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, మార్చి 18: ఐదేళ్లపాటు అధికారం అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా చేసిన అవినీతికి సీఎం జగన్ జైలుకెళ్లడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని జంగాల కాలనీ, కంబలపాడు రహదారి, కోట్ల సుజాతమ్మ నగర్ తదితర ప్రాంతాల్లో టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ అధికారం అంతా దోపిడీ పాలన సాగించారని మండిపడ్డారు. ఇసుక, మద్యం, ల్యాండ్ స్కాములతో భారీగా అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు. రాష్ట్రంలో జరిగిన వైసీపీ అవినీతి గురించి ప్రధాని మోదీ తెలుసుకున్నారని, అందుకోసమే టీడీపీ, జనసేనతో బీజేపీ కలిసి కూటమిగా ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, భాస్కర్ నాయుడు, మను, జయరాముడు, ఖాజా, ఈశ్వర్, లారీల బాషా, చంద్రపల్లి ఆచారి, పాలరాజు, ఎల్లగౌడ్ పాల్గొన్నారు.

● **టీడీపీకి మద్దతు తెలిపిన కొత్తకోట శ్రీను:** డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు కొత్తకోట శ్రీను సోమవారం మద్దతు తెలిపారు. కొత్తకోట శ్రీను ఇంటికి వెళ్లి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ గెలుపు కోసం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు కొత్తకోట శ్రీను తెలిపారు. అదేవిధంగా వైసీపీ నాయకుడు గోపినాథ్ రెడ్డి కుటుంబ సభ్యులు కోట్ల సమక్షంలో టీడీపీలో చేరారు.

యాగంటిలో ఘనంగా పల్లకి సేవ



పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె, మార్చి 18: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ పూజారులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ కుటుంబాలు

డోన్, మార్చి 18: డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కోట్ల రాఘవేంద్రరెడ్డి సమక్షంలో కోట్రాయి సర్పంచ్ తేజోమణి భర్త వైసీపీ నాయకుడు విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో 80 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. సోమవారం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో కోట్రాయి, తిర్నాంపల్లి, గుండాల గ్రామాలకు చెందిన విజయభాస్కర్ రెడ్డితో పాటు గిరిప్రసాద్ రెడ్డి, సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ బావిరెడ్డి, కేశవరెడ్డి, వెంకట్రామిరెడ్డి, తలారి ప్రకాష్, హరిబాబు, ప్రకాష్‌లతో పాటు 80 కుటుంబాలుకు చెందిన వైసీపీ కార్యకర్తలకు కోట్ల రాఘవేంద్రరెడ్డి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

బేతంచెర్ల: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన ఈడిగ చిన్నన్న, రాధాకృష్ణ, రామస్వామి, వెంకట్రాముడు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన పది కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరాయి. వైసీపీ నాయకులు మద్దిలేటి స్వామి (ఎర్రన్న)కి మండల టీడీపీ కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం ఎల్ల నాగయ్య ఇంటింటికీ తిరుగుతు ఎన్నికల ప్రచారం నిర్వహించి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్వరరెడ్డి, లొడ్డ శేఖర్, శివనారాయణ, పెద్దస్వామి, లొడ్డ రామమద్దయ్య, నల్లాడి మదనగోపాల్, వరాల రాముడు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి

అవుకు, మార్చి 18: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని అవుకు పట్టణ టీడీపీ నాయకులు రమణనాయక్, తిక్కన్న, నీలిసాయి ప్రతాప్ అన్నారు. సోమవారం అవుకు పట్టణంలో తేరువీధి, గుర్రాలపేట, కొత్తకాల్వ వీధుల్లో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో అరుణ్ కుమార్ నాయక్, అనిల్‌నాయక్, నాగార్జున, సురేశ్, నీలి నరసింహ, తిరుమలనాయక్, శ్రీనివాసులు, ఎల్లాలసుబ్బయ్య, నీలి విజయభాస్కర్, మల్లికార్జున, శంకర్, సూరి, సిద్దు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శంఖారావం క్యాలెండర్ల పంపిణీ

కొలిమిగుండ్ల, మార్చి 18: మండలంలోని గొర్విమానుపల్లెలో కొలిమిగుండ్ల మండల టీడీపీ అధ్యక్షుడు మూలె రామేశ్వరరెడ్డి టీడీపీ శంఖారావం క్యాలెండరు, బాబుష్యూరిటీ, భవిష్యత్ పత్రాలు సోమవారం పంపిణీ చేశారు. మూలే రామేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఏపీలో చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి సూపర్ సిక్స్ పథకాలు ప్రవేశపెట్టారన్నారు.

సౌర విద్యుత్‌ను వినియోగించండి

కోవెలకుంట్ల, మార్చి 18: సౌర విద్యుత్‌ను వినియోగించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగన్న కోరారు. సోమవారం కోవెలకుంట్లలో ఆయన మాట్లాడుతూ సౌర విద్యుత్‌ను విస్తరించి సామాన్య ప్రజలపై విద్యుత్ చార్జీల భారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. కోటి ఇళ్లకు సౌర విద్యుత్ అందించేందుకు పీఎం సూర్యఘర్ ముక్తియోజన పథకాన్ని ప్రవే శపెట్టారన్నారు. బాల మద్దిలేటియాదవ్, సుబ్బయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



బనగానపల్లెలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

బనగానపల్లె, మార్చి 18: త్వరలో జరగబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పోలీసులు కవాతు నిర్వహంచారు. యాగంటిపల్లె, సాధుకొట్టం, పాతపాడు, ఇల్లూరుకొత్తపేట, గ్రామాల్లో సీఐ గంటాసుబ్బారావు, ఎస్ఐ రామిరెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు.

బేతంచెర్ల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బేతంచెర్ల సీఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్ఐ శివశంకర్ నాయక్, పోలీసు సిబ్బందితో సోమవారం సాయంత్రం కవాతు నిర్వహించారు. ప్రజలకు వివరిస్తూ 30 పోలీస్ యాక్టు అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు ఊరేగింపులు నిర్వహించాలన్నా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. ఎటువంటి డీజేలకు అనుమతి లేదన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు

డోన్, మార్చి 18: ఎన్నికల కోడ్ ఉల్లంఘించే రాజకీయ పార్టీలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డోన్ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రభుత్వానికి సంబంధించిన స్థలాల్లో అన్ని రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, ముఖ్యమంత్రి ఫొటోలను తొలగించామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం ఫొటోలను తొలగించామని చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందని, 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామని అన్నారు. 26న స్క్రూటినీ ఉంటుందని, 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని చెప్పారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తామని, అన్ని రాజకీయ పార్టీలు కోడ్ నిబంధనలను పాటించాలన్నారు. చెక్‌పోస్టుల్లో వాహనాలను తనిఖీ చేస్తామని, రూ.50 వేలకు నగదు మించి ఉంటే వాటిని స్వాధీనం చేసుకుంటారని తెలిపారు.

'జాబు రావాలంటే.. బాబు రావాలి'

బేతంచెర్ల, మార్చి 18: నిరుద్యోగ యువతకు జాబు కావాలంటే బాబు రావాలని డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల చిత్రమ్మ అన్నారు. బేతంచెర్లలో నగర పంచాయతీలోని 5, 6 వార్డులలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ సీనియర్ నాయకులు పోలూరు రాఘవరెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల చిత్రమ్మ మాట్లాడుతూ జగన్ రెడ్డి పాలనలో నిరుద్యోగుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోయిందని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే 20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, నిరుద్యోగులకు ప్రతి నెలా నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పొన్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

బెస్తలను విస్మరించిన వైసీపీకి గుణపాఠం నేర్పాలి

శిరివెళ్ల, మార్చి 18: బెస్తలను విస్మరించిన వైసీపీకి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం నేర్పాలని టీడీపీ బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ యాటగిరి రాంప్రసాద్ పిలుపునిచ్చారు. గత టీడీపీ ప్రభుత్వంలో బెస్తలకు జరిగిన సంక్షేమం.. నేడు వైసీపీ హయాంలో జరిగిన అన్యాయాలను వివరించే కరపత్రాలను శిరివెళ్లలోని బెస్త కాలనీలో సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బెస్త సాధికార కమిటీ సభ్యుడు కొండబోయిన బాలచంద్రుడు, సాయి, రాము, ప్రసాద్, లింగమయ్య, పాపన్న, మహేష్, జగదీష్, వివేకానంద, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

రుద్రవరం, మార్చి 18: సచివాలయ ఉద్యోగులు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని తహసీల్దారు మురళీమోహన్ అన్నారు. సోమవారం 2, 3 సచివాలయాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. సమయపాలన లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

యువకుడి హత్య దారుణం



మాట్లాడుతున్న టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా

చాగలమర్రి, మార్చి 18: రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష ఉంటున్న టీడీపీ సానుభూతిపరుడు ఇమామ్‌బాషను (21) హత్య చేయడం దారుణమని టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. అధికార పార్టీకి సంబంధించిన నాయకుడు ధన బలం, అధికార బలంతో యువకుడిని హత్య చేయడం దారుణం అన్నారు. వేలం పాట వద్దకు ఆయుధాలు తీసుకెళ్లాల్సిన పనేముందని, ఇది ముమ్మాటికి రాజకీయ హత్యేనని అన్నారు. సోమవారం చాగలమర్రి పోలీసు స్టేషన్ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ హత్య చేయడం బాధాకరం అన్నారు. అధికార పార్టీ నాయకులు భయభ్రాంతులకు గురి చేయడం తగదని అన్నారు. రాజకీయ లబ్ధి పొందాలని భయభ్రాంతులకు గురి చేస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ప్రతిపక్షాలను బెదిరింపులకు గురి చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న హత్య జరగడం శోచనీయం అన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు మౌలాలి, అనిఫ్, టైలర్ అమీర్, ఉసేన్‌పీరా, రఫి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌పై అవగాహన సదస్సు

రుద్రవరం, మార్చి 18: బీసీ డిక్లరేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించినట్లు తాలుకా బీసీ సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు. రుద్రవరం టీడీపీ మండల కన్వీనరు ఎల్‌వీ రంగనాయకుల గృహంలో సోమవారం జయహోబీసీ డిక్లరేషన్‌లో వివరించిన అంశాలను శ్రీనివాసులు బీసీల అందరికీ చదివి వినిపించారు. కార్యక్రమంలో మండల కన్వీనరు ఎల్‌వీ రంగనాయకులు మండల టీడీపీ నాయకులు ఆలమూరు నారాయణ, యల్లావత్తుల సర్పంచ్ చంద్రమోహన్, బీసీ సంఘం కమిటీ కార్యదర్శులు యువరాజ్‌గౌడ్, వెంకటసుబ్బయ్య, పక్కీరయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి

ప్యాపిలి, మార్చి 18: మాజీ ఎంపీపీ, సీనియర్ టీడీపీ నాయకుడు టి శ్రీనివాసులు సోదరుడు టి శాంతు(48) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ వై నాగేశ్వరరావుయాదవ్, నాయకులు లక్ష్మీనారాయణయాదవ్, రామసుబ్బయ్య, ఖాజాపీర్ ఉన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

డోన్(రూరల్), మార్చి 18: పట్టణ కేంద్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. డోన్ పట్టణంలో 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1733 మంది పదో తరగతి పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. మొదటి రోజు 1644 మంది విద్యార్థులు హాజరయ్యారు. 89 మంది గైర్హాజరైనట్లు విద్యాధికారులు తెలిపారు.

బనగానపల్లె: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు ఎంఈవో స్వరూప తెలిపారు. నందివర్గం జడ్పీ ఉన్నత పాఠశాల, నందివర్గం విజయానికేతన్ పాఠశాల, నెహ్రూ ఉన్నత పాఠశాల, ఎస్వీ చైతన్య ఉన్నత పాఠశాల, బనగానపల్లె బాలి కల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రియదర్శిని ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

కొలిమిగుండ్ల: మండలంలోని పరీక్ష కేంద్రంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు ఎంఈవోలు అబ్దుల్‌కలామ్, రాజయ్యలు తెలిపారు. 4 పరీక్ష కేంద్రాలలో మొత్తం 569 మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా 25 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. ఏపీ మోడల్ స్కూల్‌లో 169 మంది విద్యార్థులకు గాను 165 మంది మాత్రమే హాజరయ్యారు. తిమ్మానాయుని పేట పరీక్ష కేంద్రంలో 75 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరయ్యారు. అంకిరెడ్డిపల్లె పరీక్ష కేంద్రంలో 163 విద్యార్థులు హాజరు కావల్సిఉండగా 10 మంది గైర్హాజరయ్యారు. కొలిమిగుండ్ల పరీక్ష కేంద్రంలో 162 మంది విద్యార్థులు హజరు కావల్సి ఉండగా 156 మంది మాత్రమే హాజరైనట్లు ఎంఈవోలు తెలిపారు.

సంజామల: మండల వ్యాప్తంగా సోమవారం పది పరీక్షలు ప్రారంభమయ్యాయి. సంజామల, కానాల, నొస్సం గ్రామాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. చీఫ్‌లుగా రామచంద్రారెడ్డి, సుదర్శన్‌రావు, రామసుబ్బారెడ్డిలు వ్యవహరించారు. కానాలలో 142 మందికి 124 మంది, సంజామలలో 178 మందికి 170 మంది, నొస్సంలో 111 మందికిగాను 104 మంది హాజరయ్యారు. ఎస్ఐ రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి బందోబస్తును ఏర్పాటు చేశారు.

ప్యాపిలి: మండలంలో పది పరిక్షలకు 85 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి వెంకటేష్ నాయక్ తెలిపారు. మండలంలోని 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మొత్తం 904 మంది విద్యార్థులు ఉండగా 819 మంది హాజరైనట్లు తెలిపారు.

రుద్రవరం: రుద్రవరం, నరసాపురం పరీక్ష కేంద్రాల్లో 50 మంది విద్యార్థినులు గైర్హాజరైనట్లు డిపార్ట్‌మెంటల్ చీఫ్ అధికారులు సుబ్బరాయుడు బాలగురప్ప, తిరుపతిరెడ్డి, నళిని సోమవారం తెలిపారు. రుద్రవరంలో 257 మంది విద్యార్థులు కాగా 228 మంది విద్యార్థులు హాజరు కాగా, 29 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. నరసాపురంలో 210 మంది విద్యార్థులకు గాను 189 మంది హాజరై 21 మంది గైర్హాజరయ్యారని వారు తెలిపారు.

ఉయ్యాలవాడ: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం జరిగిన పది పబ్లిక్ పరీక్షలకు 19 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో ప్రతాప్‌రెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రంలో 249 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా 230 మంది హాజరు అయ్యారన్నారు. పరీక్షలు పకడ్బందీగా ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.



డోన్: పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



చాగలమర్రిలో..

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని బాలుర, బాలికల, సేయింట్‌ఆన్స్ పది పరీక్షా కేంద్రాల వద్ద సోమవారం పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఆయా కేంద్రాల్లో 780 మంది విద్యార్థులకు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎస్ఐ రమణయ్య, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కేంద్రాల వద్ద గుంపులు గుంపులుగా ఉండరాదని, 144 సెక్షన్ అమలులో ఉంటుందని సూచించారు. ఆయా కేంద్రాల్లో తాగునీరు, మెడికల్ కిట్లను ఏర్పాటు చేశారు.

● పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవోలు అనూరాధ, నయాతుల్ల సూచించారు. సోమవారం మూడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థుల మౌళిక వసతులను పరిశీలించారు.

దొర్నిపాడు: మండలంలోని దొర్నిపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మొదటి రోజు పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 218 మంది రెగ్యులర్, 37 మంది ప్రైవేటు విద్యార్థులకు గాను 230 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు డిపార్టుమెంటల్ చీఫ్ రాజు తెలిపారు.